# రైళ్లు మారిన ప్రయాణం

అంగర వెంకటకృష్ణారావు

కథానిక

అగ్ని రగులుతూన్న మానవ హృదయం వలె యింజన్‌గొట్టం రాక్షసి బొగ్గు రవ్వలు కక్కుతూంది. అదే హృదయంలోంచి వెలువడే నిరాశాంధకారంలా ఒత్తుగా, నల్లగా పొగలేచి అంతటా వ్యాపిస్తూంది. ఇనుపగుఱ్ఱంలా పరుగులిస్తూంది రైలు.

జీవన మరణాల మధ్య ఊగిసలాడుతూన్న ఒక మానవుడికి ఆ సమయంలో ప్రకృతి కూడా తారుమారైనట్టు గోచరించింది. పరుగెడుతూన్న రైలు నిలబడిపోయి, స్థావరంగా వున్న కొండలు, చెట్లు, టెలిగ్రాఫ్ స్తంభాలు జోరుగా వెనక్కి పరుగెడుతూన్నట్టు అగుపించాయి; అతనిలో మరింత నిరాశ రేగి, లాగుతూన్న సిగరెట్టు దమ్ము రుచిలేక చప్పగా వున్నట్టు తోచి, సిగరెట్టు అవతల పారవేశాడు. సగం పైకి వున్న శరీరాన్ని లోపలికి తీసి తన పక్కమీద కూచుని కళ్లు నులుముకు నిట్టూర్చాడు. ఎదురు బెర్తుమీద ఎడంవాటుగా ఒత్తిగిలి కళ్లు మూసిన స్త్రీమీద పడ్డది అతని దృష్టి.

"హాయిగా నిద్రపోతూంది" అనుకున్నాడు.

ఆమె పెదవులు అప్పుడప్పుడు వణకుతున్నాయి. ఆల్చిప్పల వలె మూసివున్న విశాలమైన కళ్ళలో యేదో ఖేదంవున్నా, అందంవుంది. వంగినవిల్లువంటి కనుబొమలలో, వెడల్పైన నుదుటిపై బొట్టు దర్జా వుంది. ఆమె ఒంటిమీద నగలు లేవు. గాలికి కొంచెం ఒత్తిగిలిన పమిటలోంచి మంగళ సూత్రం తొంగి చూస్తూంది.

"అదృష్టవంతురాలు. అనుకూల దాంపత్యం సౌఖ్యం అనుభవిస్తూన్న యీ స్త్రీ తన భర్తదగ్గరకు వెడుతూంది. పుట్టింటినుండి కాబోలు! బహు అదృష్టవంతుడీమె భర్త. అనుకుని ఒక్కసారి కళ్లు గట్టిగా మూసుకున్నాడు.

రైలు తన తలలోనే పరుగెడుతూన్నట్టుంది. కొండలు, చెట్లు, టెలిగ్రాఫ్ పోల్సు తన కడుపులోనే గిర్గిర తిరిగి పోతున్నాయి. అతడు నిద్రపోవడానికి ప్రయత్నించాడు. కాని యీ రైలు హడావుడిని మించి యేవో గావుకేకలు వినిపిస్తున్నాయి.

"అస్తమానం రాతలు రాతలు రాతలు! ఎందుకొచ్చిన రాతలో! కూరలేదని నిన్నరాత్రినుంచీ శతపోరుతూన్నా కిమన్నాస్తి! హయ్యో భగవంతుడా! అందుకే నా రాత యిలా తగలడింది."

మాగన్నులో అతడు ఉలిక్కిపడ్డాడు. తను వ్రాస్తూన్న కథలో పేదవాడి భార్య బాలింతకు పాలు పడలేదు. పసిపిల్లకు పాలు కొనడానికి చేతిలో చిల్లిగవ్వలేదు. మగవాడు వీధిలోకి వెళ్ళకపోతే పొయ్యిలో పిల్లి పడుకుంటుంది. ఈ చిక్కులోంచి, యీ నిర్భాగ్య కుటుంబాన్ని యెలా బైట పెట్టడం అన్న సమస్య బాధ్యత వుండవలసిన వాళ్ళకి లేకపోతే, కనీసం సానుభూతి అయినా తన భార్య అనబడే మానవపదార్థానికి లేదేమని వాపోయేడు. అదే జ్ఞాపకం— అదే ఆలాపన. ఆ కథ అక్కడే ఆగిపోయింది. ఆ కథ అనాది సిద్ధమైనది. కర్మసిద్ధాంతానికి చెల్లెలు!

నిద్రపట్టలేదు. లేచేడు. సిగరెట్టు వెలిగించి గుఫ్‌గుఫ్‌మని దమ్ములాగి, అనుకోకుండా ఆ పడుకున్న అమ్మాయి వైపు చూశాడు.

నిద్రలో మునిగివున్న ఆమె కనుకొలుకుల్లోంచి కన్నీళ్లు పడుతున్నాయి. పెదవులు వణుకుతున్నాయి.

"ఎంత జాలిగుండె! ధన్యుడంటే యీమె భర్తే!"

తేరిపారి చూసేడు. "ఎక్కడో చూసినట్టుంది యీమెను" అనుకొన్నాడు. అలా అనుకొంటూనే కిటికీవెంపు తిరిగి ఆకాశంలోకి చూశాడు. నల్లని ఆకాశంమీద పూర్వజన్మస్మృతులవలె నక్షత్రాలు మెరుస్తూ మాయమౌతూ, అగుపించీ అగుపించక పోతున్నాయి.

"ఈమెతో నాకు జన్మాంతర సంబంధం వున్నదేమో. జీవిత యాత్రలో కలియలేకపోయినా రైలుయాత్రలో కలిశాం! నిద్రలోకూడా మాప

తుల సానుభూతిని అయస్కాంతంవలె ఆకర్షించే యీమె, మనసిచ్చి, చనువిచ్చి వలపించే భర్తను ఆనందంలో ఉఱ్ఱూతలూగిస్తూండాలి. అతని బిగువైన కౌగిలిలో..."

చురుక్కుమంది వేలు. సిగరెట్టుపీక క్రింద జారిపోయింది.

అతడు తిరిగి పక్కసర్దుకుని పడుకున్నాడు. అంతస్సంఘర్షణ అనే క్లోరోఫారమ్ మైకంలో మైమరచేడు.

రాత్రి రెండు దాటింది. చిన్నగాలి వీస్తోంది. వాతావరణం చెమ్మదేరింది. ఆమెకు మెలకువ వచ్చింది. లేచి కూచుంది. కాని నిద్రాభారంతో తల యింకా బరువుగా వుంది.

రైలు జోరుగాపోతోంది. ఆమె కిటికీలోంచి ఆకాశంలోకి చూసింది. మేఘం వేసింది, చుక్కలు లేవు. అంధకారం.

ఆమె ముఖంలో అభిమానం, కళ్ళల్లో అవమానం, పెదవులపై వికట మందహాసం పొడసూపేయి.

'నడిరే...చీకటిలో...ఆకస మావర్తించిన, మేఘాలావర్షించిన...' అచ్చంగా నా బతుకే...

తనకు పెళ్ళికాక పూర్వంరోజులు జ్ఞాపకానికి వస్తూన్నాయి. వాల్తేరులో పుట్టింట హాయి జీవితం కాలేజీ చదువు. లోవతోట, సింహాచలం విహారాలు, సింహాచలం కొండక్రింద పక్కగా వున్న తోటలో రాలిన సంపెంగపూలు మెట్టతామర గింజలు యేరుకోవడం, బీచి షికారులు, ఫొటోలు సినీమాలు, పాటకచేరీలు, ముఖ్యంగా అతిముఖ్యంగా తన సంగీతం! అదంతా ఒక కల! శ్రావణ జలదాల వంటి ఆమె నేత్రాలు వర్షించాయి.

దిగులుగా ఆ పడుకున్న అతనివైపు చూసింది. అతని హృదయం లేచి పడుతూంది. కనురెప్పలు స్పందిస్తున్నాయి. నొక్కునొక్కుల అతని జుట్టు చెదిరి తమాషాగా వుంది. ఏవో చిక్కుడుకాయల్లాంటి లేతవేళ్ళు ఆ జుట్టులోంచి ప్రాకినట్టు ఆమె వూహించింది. ఆ లేచిపడుతూన్న ఛాతీ యే హృదయంకోసం వుబలాటపడుతూందో! ఆ వణకుతూన్న పెదవులు యే నున్నని చెక్కిళ్ళకోసం...

అదాట్టుగా తన యెడం చెంపపైకి చెయ్యి పోయింది. ఇంకా నొప్పి తీరలేదు. పిడకలాంటి అరచెయ్యి ముద్ర యింకా వుందేమో!

'ఛీ, బానిస బ్రతుకు!' అని చిరచలికి ముడుచుకు పడుకుంది. ఆమె చెవుల్లో యేవో బుసలు వినిపిస్తూన్నాయి. అధికారం చలాయించడం తన విధిగా నమ్మిన అత్తగారు చెప్పగా 'ఆయన' తన యింటరు సర్టిఫికేటు మండుతూన్న పొయ్యిలో పడవేశాడు. ఆ కాగితంవలె తన గుండె దుఃఖాగ్నిలో భగభగ మండింది.

ప్లీడరు గారికి పొద్దున్నే నిద్రలేచింది మొదలు, రాత్రి పన్నెండుగంటలవరకూ దావాలు, వాయిదాలు, పిటీషనులు తప్ప మరే వ్యాపకం అక్కరలేదు. అతని ప్లీడరీ కళాజీవితంలో పార్టీలే సాముజికులు. డబ్బే అతని లక్ష్యం. పేపరు కూడా పొరుగింటి మెడికల్ విద్యార్థి చదివిన తరవాత తెప్పించుకు చదువుతాడు. తను శ్రావ్యంగా పాడుతుందని గాని, లోకంలో ఎవ్వరైనా ఎందుకు గొంతెత్తి రాగాలాపన చేస్తారో అతనికి తెలీదు. ఇంటిపని అంతా గొడ్డులా తనుచేసినా, ఆ కొద్ది విరామసమయంలోకూడాచదువుకోకూడదు.

అత్తగారి ఖరోడా, ఆడపడుచు సాధింపు, ఆయన నిర్లక్ష్యం, క్రూరత్వం, వాటిమధ్య తనుచేసిన సహన తపస్సు వ్యర్థం. 'అస్తమానం చదువే. ఇది మొగుణ్ణిని వదలిపెట్టి వుద్యోగం చేస్తుంది' అనితల్లీ కూతుర్లు యింటికి వచ్చిన ప్రతివారితో చాటుతూంటారు.

ఆ వేళ మధ్యాహ్నం తనను భర్త కొట్టిన లెంపకాయ తన సహనానికి స్వస్తివాక్యం పాడింది.

ఈభగ్న హృదయాల్ని రెండింటిని మోసుకు, చీకటిని భేదించుకుంటూ పోతూంది మెయిలు. వీళ్ళిదివర కొకరి నొకరు ఎరగరు. ఒకరినొకరు కనీసం చూచుకోనైనా లేదు. కాని యెంత సానుభూతి కలిగింది! ఎంతో పరిచయం వున్నట్టు, ఒకరినొకరు అర్థం చేసుకున్నట్టు, ఒకరిపై ఒకరు గౌరీ శంకర శృంగం అంత అభిప్రాయం యేర్పరచుకున్నారు.

బూజుల కొంపలాంటి యీ సంఘంలో ఎన్ని సువర్ణ విగ్రహాలిలా కర్రకాళ్ళతో కూలబడి వున్నాయో, ఎన్నెన్ని జీవాలు తమ ఉన్నతాశయ ఆకాశ వీధులకు యెగిరించలేని కురుచరెక్కలతో అల్లాడుతున్నాయో, ఎన్నెన్ని హృదయాలు తమకు చేతివాటుగా వుండి అందని కోరికలనే అగ్నులను భరిస్తున్నాయో ఎవ్వరెరుగుదురు!

ప్రత్యక్ష జీవితంలో ఆశయాల్లో, ఆశల్లో అనునిత్యం దెబ్బతింటూ, ఊహాజీవితంలో మోసపోతూన్న యీ వ్యథిత హృదయాలు, యెక్కడైనా యెప్పుడైనా కలుస్తాయా అంటుంది సమాజపు పాముల పుట్టలోకి బితుకుగా దృష్టి సారించిన సంశయాత్మ!

కాని ఆ రైలు ఆగదు. అలా పరుగెడుతూనే వుంది. అథవా, యెక్కడైనా ఆగిందా, కాస్త వూపిరి తీసుకోని, గొంతు తడి చేసుకుని తిరిగి పరుగు లంకించుకోడానికే!

తెలతెల వారుతూంది. 'బాలసోర్' స్టేషను దగ్గర రైలు దాహంవేసి ఆగింది. అతనూ ఆమే అప్పుడే లేచేరు. 'టీ' తాగేరు. అతనింకా ఖిన్న వదనంతోనే వున్నాడు. ఆమె కేసి రెండుసార్లు చూసి ఉదాసీనంగా తల దించుకున్నాడు. భర్తని సుఖపెట్టి తను సుఖపడే ఈ పవిత్రజీవిని ముఖంలోకి తేరి చూడడానికైనా తనకు హక్కులేదనుకొన్నాడేమో!

కాని ఆమెముఖంలో యేదో నవవికాసం కలిగింది. ఆమె సహజంగా ఓర్మిగలది. అత్తగారు ఆడబిడ్డల రాపిడికి రాటుదేరింది. రెండుకాళ్ళ జంతువువంటి 'ఆయన'తో రెండేళ్లు గడిపింది. కాఫీ తాగిన తరువాత చీపురుకట్టలవంటి మీసాలకంటుకున్న కాఫీ తుడుచుకోవాలని యెరగడని దుఃఖించినా, ఆ జుగుప్సాకర దృశ్యంకూడా చూసి భరించింది, మునిసిపాలిటీ కుళ్లుకాలవల వలె!

"ఏ వూరు వెడుతున్నారండీ?"

అతనులిక్కిపడ్డాడు. తననేనా! ఔను అదిగో మళ్ళీ అడుగుతూంది.

"కలకత్తా."

"నేనూ కలకత్తాయే. మీకక్కడ ఉద్యోగమా?"

"కాదు."

'మరి."

"ఒక స్నేహితుడింటికి వెడుతున్నా. మీ..."

"కాదు కాదు. కలకత్తాలో, మా అక్క, అంటే మా పెదతల్లి కూతురుంది. వాళ్ళింటికి..."

"ఒక్కరే?"

"ఔనండీ ..ఇన్నాళ్లూ యిద్దరంగాని, నిన్నటి నుంచీ ఒక్కర్తెనే..."

"అయ్యో పాపం!" అని అతడింకా గొణిగేడు.

కాని అప్పుడే రైలు కూసి కదిలింది. ఆ హడావుడిలో యేమన్నాడో వినిపించలేదు.

"ఎవరింటికో అడగొచ్చా?"

ఫలానా యింటికని చెప్పింది.

"అరెరే! నేనూ అక్కడికే వెడుతున్నా. వాడు నాకోసం హౌరా స్టేషనుకొస్తాడు. వాడు నా ప్రాణస్నేహితుడు."

"అల్లాగా...ఆయన మా బావగారు. నేను పూర్వాశ్రమంలోంచి పరారీ అవుతున్నా..."

అతను గతుక్కుమన్నాడు. ఆ తొందరలో 'నాలాగే' అని పైకన్నాడో, లోపలనే అనుకున్నాడో అతనికే గుర్తులేదు. కాని అది ఆమెకు వినిపించినట్టయింది. వాళ్ళ హృదయవీణలలో ఒకే శ్రుతిలోవున్న రెండు తంత్రులు ఒకేసారి మ్రోగి వుండాలి.

ఆమె లేచివచ్చి అతనిప్రక్క కూచుంది. ఆ నిముషంనుంచీ వాళ్లు యథేచ్ఛగా మాట్లాడుకున్నారు. ఒకళ్ళ హృదయాలొకరి ముందు గుమ్మరించుకున్నాడు. ఒకరి బాధ వొకరు పంచుకున్నారు. ఒకరిమీదొకరు దోసెళ్ళ కొలదీ సానుభూతి వర్షించుకున్నారు.

రైలు శరవేగంతో పిడుగులు పొడుస్తూ పరుగెడుతూంది. ఖర్గపూర్ వచ్చింది. ఇద్దరూ దిగిపోయేరు. ఊళ్లోకి వెళ్ళి ఒక హోటలులో బస చేసేరు. స్నానపానాలు ముగించుకుని, వెళ్ళి కలకత్తాకు టెలిగ్రాం పంపేరు రావడం లేదని.

సాయంత్రం ఎనిమిది గంటలకు మెయిలు వచ్చింది. ఎయిర్ కండిషన్‌డ్ క్లాసులో ఎక్కేరు. రైలు పరుగు లంకించుకుంది. ఆ పగలు, ఆ రాత్రి వాళ్లు తీయనిబాధ యెంతైనా అనుభవించేరు. అతడు తన పద్యాలు గేయాలు ఆమెకే చదివి వినిపించాడేమో. ఆమె తన తనివితీరా అతనికి పాటలు వినిపించేదేమో ఆ రైల్లోనే. ఆ వివరాలు అనవసరం. కాని వొక్కటి నిజం. ఈ పాత రైల్లో ప్రయాణం చేసినన్నాళ్ళూ మనకీ యిబ్బందులు తప్పవని యిద్దరూ గ్రహించేరు.

ఉదయం విజయనగరంలో అతడు దిగిపోయేడు. సాయంత్రం రాజమండ్రీలో ఆమె దిగిపోయింది. గ్రహాలు గతులు తప్పకుండా నడుస్తున్నాయి. ★